# తీర్పు

మందరపు పద్మ, లలిత

పురందరపురంలో ధనదత్తు డనే వైశ్యు డున్నాడు. మేరు పర్వతాలను వెక్కిరించే ధాన్యరాసులతో, కామధేనువులను మించే వేల సంఖ్యల గోవులతో, పుట్లకు పుట్లు పండే భూములతో, గుట్టలు గుట్టలుగా పడివుండే ధనరాసులతో అతడు సాక్షాత్తు లక్ష్మీపుత్రు డనిపించుకున్నాడు. బంగారానికి వాసన అబ్బినట్లే సంపదకు తోడు, అతనికి సంతాన సంపదకూ ఏ లోటూ లేదు. అతనికి రత్నాల్లాంటి చక్కని నలుగురు కొడుకులున్నారు.

కొన్ని యేళ్ళ కతడు బాగా ముసలివాడైపోయాడు. అతని కొడుకులు యౌవనంలో అడుగుపెట్టారు. ముసలితనానికి తోడు, అతని కేదో దీర్ఘవ్యాధి పట్టుకున్నది. వైద్యులంతా చూచి పెదవి విరిచారు. ఒకనా డతనికి జబ్బు మరీ యెక్కువయింది. తనకు మరణసమయ మాసన్నమయిందని తెలుసుకుని ధనదత్తుడు, నలుగురు కొడుకులను దగ్గరగా పిలిచి "నాయనలారా! నా కాలం అయిపోయింది. నేను వెళ్ళిపోతున్నాను. మీలో మీరు తగువులాడుకోకుండా, కలిసి మెలిసి జీవించండి. వరుసగా నా మంచంకోళ్ళ క్రింద పాతిపెట్టిన పాళ్లుగా మీరు నా ఆస్తిని పంచుకోనండి"—అని చెప్పి హాయిగా కన్నుమూశాడు.

తండ్రి పోయిన తర్వాత కొడుకులు అతనికి తమ కులధర్మానుసారంగా కర్మకాండలు జరిపేరు. ఆ విచారంలోనుండి కోలుకున్న కొన్ని రోజులకు, ఒక శుభ ముహూర్తాన, మంచంకోళ్ల కింద త్రవ్వి చూశారు. చూడగా, వాటి క్రింద వరుసగా చిట్టు, మన్ను, బొగ్గులు, ఎముకలు కనపడ్డాయి. ఆత్రంగా ఆస్తిని పంచుకొందామనుకొన్న వారికీ తుచ్ఛ వస్తువులు కంటపడడంతోటే మనస్సులలో కెలికినట్లయింది. వీటిని పంచుకోమనడంలో ఆయన ఆంతర్య మేమిటి? చనిపోయేముందు ఆయనకు గాని మతి చలించలేదుగదా! ఇలా పరిపరివిధాల ఆలోచించుకుని, చివరకు తండ్రిభావం తమకు సరిగా బోధపడలేదనే నిశ్చయానికి వచ్చారు. ఆ రహస్యాన్ని విప్పి చెప్పమని దేశదేశాల రాజుల దగ్గరకు వెళ్ళి ప్రాధేయపడ్డారు.

ఏ రాజుకు చిక్కు విడదీసే సామర్థ్యం లేకపోగా, పైపెచ్చు "మీ తండ్రి ఆజ్ఞానుసారం ఒకరు చిట్టు, ఒకరు బొగ్గులు, ఒకరు మట్టి, ఒకరు ఎముకలు తీసుకోండి—" అంటూ అవహేళన చేయడం మొదలుపెట్టేరు. చివరికి వారు ప్రాణం విసిగి ప్రతిష్ఠాన నగరం చేరుకున్నారు. ఆ పూరి రాజైన శాలివాహనునితో తమ తగవును పరిష్కరించమని మనవిచేసుకున్నారు. రాజు పకపక నవ్వి "ఎవ్వరూ యీ మాత్రపు చిక్కును విప్పి చెప్పలేకపోయారటయ్యా! మీ తండ్రి మీకు భాగాలను సరిగానే పంచిపెట్టేడు. మట్టి అంటే—తాను సంపాదించిన భూములు. ఊక అంటే ధాన్యం. బొగ్గు—అంటే బంగారం. ఎముకలంటే పశువులు. వీటిని వరుసగా మీలో పెద్దవాడు భూములను, రెండోవాడు ధాన్యాన్ని, మూడోవాడు బంగారాన్ని, నాల్గోవాడు పశువులను తీసుకోవాలని అతడి భావన" అని విప్పి చెప్పేడు. సోదరులంతా రాజుగారి తెలివి కాశ్చర్యపడి, తమ తండ్రి ఆదేశానుసారం ఆస్తి పంచుకొని, హాయిగా కాలం వెళ్ళబుచ్చసాగారు. ★




